సాక్షి
నల్లగొండ
మంగళవారం। 11। జూలై। 2023



జలాశయంలో సెయిలింగ్ రేస్
శిక్షణలో భాగంగా నావెల్ క్యాడెట్లకు సోమవారం సాగర్ జలాశయంలో వాయిలర్ సెయిలింగ్ రేస్ నిర్వహించారు. - 8లో



సైనికుల త్యాగాలు మరువలేనివి
సైనికులు చేసిన త్యాగాలు మరువలేనివని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
36° / 27°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎన్జీ కళాశాలలో జాబ్ మేళా

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. ఎంఎస్ఎన్ కెమికల్ ల్యాబ్ వారు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 136 మంది విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనగా 77 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్ తెలిపారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ ఇన్‌చార్జి డాక్టర్ అంతటి శ్రీనివాస్, అకడమిక్ కోఆర్డినేటర్ వెంపటి శ్రీనివాసులు, నాగిరెడ్డి, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, ముత్తయ్య, యాదగిరిరావు, దుర్గాప్రసాద్, ఎంఎస్ఎన్ ల్యాబ్ మేనేజర్ బ్రహ్మానందరెడ్డి, మోహన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యం పూర్తి చేయాలి



ఎల్లారెడ్డిగూడెంలో సంపద వనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నార్కట్‌పల్లి : హరితహారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నార్కట్‌పల్లి మండలంలో మొక్కలు నాటే పనులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో సంపద వనాల ప్లాంటేషన్ భూమిని పరిశీలించారు. ప్లాంట్ ఎస్టిమేషన్ ప్రకారం టాస్కల వారీగా గుంతలు తీయడం, ప్లాంటింగ్ చేసి మొక్కలను సంరక్షించడంపై అధికారులకు సూచనలు చేశారు. మండలంలో హరితహారం లక్ష్యాన్ని పూర్తిచేసి అన్ని గ్రామాల్లో మాస్ ప్లాంటేషన్ చేయాలన్నారు. దాసరిగూడెం ప్లాంటేషన్ సైట్‌ను సందర్శించి అవెన్యూ ప్లాంటేషన్ మల్టీలేయర్ ప్లాంటేషన్ చేయాలని సూచించారు. చౌడవరం పంప్ హౌజ్ వద్ద జరుగుతున్న ప్లాంటేషన్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఓ అదనపు పీడీ శైలజ, అసిస్టెంట్ పీడీ ఉపేందర్‌రెడ్డి, ఎంపీడీఓ యాదగిరి, ఇన్‌చార్జి ఏపీఓ రాంబాబు ఉన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నల్లగొండ టౌన్ : రాష్ట్రంలో కేసీఆర్ అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12 వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతోందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస వసతులు కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రవీణ్, ప్రణీత్, పూర్ణచందర్, రాజు, వెంకటేశ్, కార్తీక్, స్టాలిన్, సాయి పాల్గొన్నారు.

అలీనగర్ వద్ద బ్రిడ్జి పనులు

హాలియా : మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్ (14 మైలురాయి) సమీపంలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వపై సోమవారం నేషనల్ హైవే అధికారులు బ్రిడ్జి పనులు చేపట్టారు. నకిరేకల్-నాగార్జున సాగర్ వరకు రూ.253 కోట్లతో చేపట్టిన 565వ నంబర్ జాతీయ రహదారి పనుల్లో భాగంగా అలీనగర్ సమీపంలోని 14వ మైలురాయి వద్ద సాగర్ ఎడమ కాల్వపై రూ.4.5 కోట్లతో బ్రిడ్జి పనులు చేపడుతున్నారు. మేజర్ బ్రిడ్జి పనుల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు బ్రిడ్జి బీమ్‌లను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో నల్లగొండ-హాలియా జాతీయ రహదారిపై వాహనాలను నిలిపివేశారు. ఆ తర్వాత వాహనాల రాకపోకలు కొనసాగాయని నేషనల్ హైవే జేఈ మురళి కృష్ణ తెలిపారు.



అలీనగర్ వద్ద సాగుతున్న బ్రిడ్జి పనులు

సమ్మెలో కార్మికులు.. వంట చేసిన ఉపాధ్యాయులు



తిప్పర్తి మండలం ఇండ్లూరు పాఠశాలలో విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న ఉపాధ్యాయులు

రామగిరి(నల్లగొండ) : మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తుండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం స్వయంగా మధ్యాహ్న భోజనం వండారు. పాఠశాలలో మొత్తం 178 మంది విద్యార్థులు ఉండడంతో వారికి ఇబ్బంది కలగొద్దని ప్రధానోపాధ్యాయుడు వీరాచారి చొరవ తీసుకొని మహిళా ఉపాధ్యాయులతో కలిసి వంట చేశారు. అనంతరం వారే స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు.

పిండి రాలే.. జావ అందలే!

- పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీకాని రాగి జావ
- తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో అట్టహాసంగా ప్రారంభం
- ఈ నెల 1 నుంచి అన్ని పాఠశాలల్లో అమలు చేస్తామని ప్రకటన
- 10వ తేదీ దాటినా ప్రారంభం కాలే..



నల్లగొండ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పోషకాహారం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన రాగిజావ పంపిణీకి ప్రారంభంలోనే అవాంతరాలు ఎదురవుతున్నాయి. గత నెలలో నిర్వహించిన తెలంగాణ అవతరణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన విద్యా దినోత్సవం రోజున రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. జూలై 1వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో అమలు చేస్తామని ప్రకటించారు. 10వ తేదీ గడిచినా నేటికీ విద్యార్థులకు రాగిజావ అందడం లేదు. ఇప్పటివరకు పాఠశాలలకు రాగి, బెల్లం పిండి ప్యాకెట్లు రాలేదు. దీంతో విద్యార్థులు రాగిజావ కోసం ఎదురుచూడక తప్పడం లేదు.

జిల్లాలో 1483 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లాలో మొత్తం 1483 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటి పరిధిలో 1,05,000 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. వారానికి 3 రోజులు కోడిగుడ్డును అందిస్తోంది. అయితే విద్యార్థులకు మరింత పోషకాలతో కూడిన ఆహారం అందించేందుకు గాను ఉదయం వేళలో రాగిజావ అందించాలని నిర్ణయించింది.

వారానికి మూడు రోజులు..

జూలై 1 వ తేదీనుంచి రాగిజావ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. రాగి పిండి మాత్రం పాఠశాలలకు చేరలేదు. మధ్యాహ్న భోజన కార్మికులతోనే రాగిజావ అందించాలని నిర్ణయించారు. రాగి పిండిని మాత్రం శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సరఫరా చేస్తామని ప్రకటించారు. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగిజావలో మరో 10గ్రాముల బెల్లంపొడి కలిపి ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం ప్రతిరోజు మధ్యాహ్నం భోజనం పెడుతున్నా మూడు రోజులు మాత్రమే కోడి గుడ్డు ఇస్తున్నారు. సోమ, బుధ, శుక్రవారాల్లో గుడ్డును అందిస్తున్నందున మిగిలిన మూడు రోజులైన మంగళ, గురు, శని వారాల్లో రాగి జావ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే 1వ తేదీలోపే అన్ని పాఠశాలలకు రాగి పిండి అందాల్సి ఉన్నా సరఫరాలో జాప్యం కారణంగా జావ పంపిణీ ప్రారంభం కాలేదు.

ఇండెంట్ అడిగిన అధికారులు

జిల్లాలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి.. ఎంత మంది విద్యార్థులు ఉన్నారు.. ఎంత పిండి అవసరం ఉందో వివరాలు ఇవ్వాలని రాష్ట్ర విద్యాశాఖ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ప్రస్తుతం ఎంఈఓల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. దీన్నిబట్టి విద్యార్థులకు రాగిజావ అందించేందుకు మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉందనే విషయం స్పష్టమవుతోంది.

పిండి రాగానే జావ అందిస్తాం



జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలకు రాగి పిండి సరఫరా కావాల్సి ఉంది. పిండి వచ్చిన వెంటనే అన్ని పాఠశాలలకు పంపుతాం. ఆ తర్వాత వెంటనే రాగిజావ పంపిణీ చేస్తాం. పైఅధికారుల ఆదేశాల మేరకు వ్యవహరిస్తాం.
– భిక్షపతి, డీఈఓ

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

నల్లగొండ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 85 దరఖాస్తులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో దూరం నుంచి వ్యయ ప్రయాసల కోర్చి సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తున్న ప్రతిఒక్కరి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కాళిందిని తదితరులు పాల్గొన్నారు.

నా కొడుకుకు గురుకులంలో సీటు ఇప్పించండి



నేను ఒంటరి మహిళను, వికలాంగురాలిని కూడా నా కుమారుడికి గురుకుల పాఠశాలలో 5వ తరగతి సీటు ఇప్పించాలని నేరెడుగొమ్ము గ్రామానికి చెందిన గంగాధర్ మంజుల కోరారు. కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉందని.. కుమారుడిని చదివించుకోవడం కూడా కష్టంగా ఉందని.. నా కుమారునికి గురుకులాల్లో సీటు ఇప్పించాలని కోరింది.
– మంజుల, ఒంటరి మహిళ

మమ్ములను ఆదుకోవాలి



నాకు ప్రమాదంలో కాలు తీసేశారు. నడవలేని పరిస్థితి. కుటుంబంపై ఆధారపడుతున్నాను. నేను ఏదైనా వ్యాపారం చేసుకునేందుకు రుణం ఇవ్వాలని పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదు. వికలాంగుల శాఖ ద్వారా రుణం ఇప్పించి ఆదుకోవాలని తిరుమలగిరి సాగర్ మండలం తెట్టకుంట గ్రామానికి చెందిన వెంకటయ్య విజ్ఞప్తి చేశారు. – కొత్త వెంకటయ్య, దివ్యాంగుడు

రుణం ఇప్పించి ఆదుకోవాలి



హాలియా మండలం అల్వాల గ్రామానికి చెందిన దివ్యాంగుడు అయిన ఆదెపు శ్రీను గ్రామంలో చిన్న షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఉదయం పాలు అమ్ముతూ బతుకుతున్నాయనని, నాకు వికలాంగ శాఖ నుంచి రుణం ఇప్పించి ఆదుకోవాలని కోరాడు.
– ఆదెపు శ్రీను, దివ్యాంగుడు

పింఛన్ ఇప్పించండి



నాకు ఒక కన్ను పోయింది. పెన్షన్ కోసం పోతే మెడికల్ బోర్డు నుంచి సర్టిఫికెట్ కావాలంటే తీసుకొచ్చా అందులో 20 శాతమే ఉండడంతో పింఛన్ మంజూరు కాలేదు. మళ్లీ దరఖాస్తు చేసుకోమంటున్నారు. అందుకోసం స్లాట్ బుక్ చేస్తే కావడంలేదు. కలెక్టరేట్ చుట్టూ తిరిగి తిరిగి అలసిపోతున్నా. పింఛన్ ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. – నాగరాజు, చింతలపాలెం

ఉద్యోగిపై చర్య తీసుకోవాలి



నల్లగొండలోని లతీపుల్లాషా ఖాద్రికి సంబంధించిన 536 ఎకరాల వక్ఫ్ భూమి ఉందని దాన్ని యజమానులమని చెబుతూ కొందరు అమ్ముకుండుండగా అందుకు వక్ఫ్ బోర్డు కార్యాలయంలో పనిచేసే జానీ అనే ఉద్యోగి సహకరిస్తున్నారు. భూములు విక్రయించిన, అందుకు సహకరిస్తున్న ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి.
–ఇంతియాజ్, మాజీ కౌన్సిలర్, నల్లగొండ

చండూరు ఎంపీపీపై అవిశ్వాసానికి నోటీస్



నల్లగొండ అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా కు నోటీసు అందజేస్తున్న ఎంపీటీసీలు

చండూరు : చండూరు ఎంపీపీ పల్లె కళ్యాణిపై అవిశ్వాసం కోరుతూ తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు ఆర్‌డీఓ కార్యాలయం ఇన్‌వార్డ్ సెక్షన్‌లో, అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాకు సోమవారం నోటీస్ అందజేశారు. గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోగా, సభ్యులకు కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆ నోటీస్‌లో పేర్కొన్నారు. వెంటనే అవిశ్వాసం పెట్టాలని కోరారు. నోటీస్ ఇచ్చిన వారిలో ఆరుగురు సభ్యులు సొంత పార్టీ (బీఆర్ఎస్) సభ్యులు కాగా, మరో ముగ్గురు బీజేపీ సభ్యులు ఉన్నారు.

రమ్మన్నారు.. విధులకు రాలేదు..

అవిశ్వాసం నోటీస్ ఇచ్చేందుకు ఈ నెల 6వ తేదీన స్వయంగా తాము ఆర్‌డీఓ కార్యాలయానికి వస్తే.. 10వ తేదీన రావాలని.. సమయమిచ్చిన ఆర్‌డీఓ సోమవారం విధుల్లో లేకపోవడం బాధాకరమని సదరు ఎంపీటీసీ సభ్యులు పేర్కొన్నారు. నోటీస్ ఇచ్చిన వారిలో ఎంపీటీసీ సభ్యులు అవ్వారు గీత, చెరుపల్లి భాస్కర్, గొరిగే సత్తయ్య, పెండోటి వెంకటమ్మ, పల్లె వెంకన్న, వనజ, తిప్పర్తి లక్ష్మమ్మ, కావలి మంగమ్మ, చేపూరి యాదయ్య ఉన్నారు.

మర్రిగూడ ఎంపీపీపై..



ఆర్డీఓ శ్రీరాములుకు అవిశ్వాసం నోటీసు అందజేస్తున్న ఎంపీటీసీలు

మర్రిగూడ : మర్రిగూడ ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డిపై అవిశ్వాసం కోరుతూ 8 మంది ఎంపీటీసీలు సభ్యులు దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారం రోజుల నుంచి 8 మంది ఎంపీటీసీలు క్యాంపులో ఉన్నారు. ఇటీవల ఆర్డీఓ కార్యాలయంలో అవిశ్వాస పత్రం ఇచ్చినప్పటికీ.. సోమవారం నేరుగా కలిసి అవిశ్వాసం కోరుతూ నోటీసు అందచేశామని పలువురు ఎంపీటీసీలు తెలిపారు. నోటీసు అందజేసిన వారిలో ఎంపీటీసీలు గండికోట రాజమణి, సిలివేరు విష్ణు, ఏర్పుల శ్రీశైలం, కట్కూరి వెంకటేష్‌గౌడ్, సేనావత్ బంతిలాల్, వెన్నమనేని శోభ, తుమ్మల వరప్రసాద్, దాసరి మమత ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సోమవారం సందర్శించారు. నల్లగొండ, తుంగతుర్తి, హుజూర్‌నగర్ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, శానంపూడి సైదిరెడ్డిలతో కలిసి పార్టీ కార్యాలయం లోపలి భాగాన్ని పరిశీలించారు. ఫర్నిచర్, స్టేజీ తదితర వివరాలను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యాలయం భవన నిర్మాణం, మోడల్ తదితర విషయాలను సంబంధిత కాంట్రాక్టర్ మంత్రికి వివరించారు. ఇదే మోడల్‌ను సూర్యాపేటలో అమలు కోసం మంత్రి పరిశీలించినట్లు పార్టీ నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ పంకజ్‌యాదవ్, కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, సమీ, కోఆప్షన్ మెంబర్ జమాల్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్, చిత్రంలో వీహెచ్, చెరుకు సుధాకర్ తదితరులు

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, మాజీ ఎంపీ వీహెచ్
- సూర్యాపేటలో బీసీల ఐక్యవేదిక సమావేశానికి హాజరు

భానుపురి (సూర్యాపేట): బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు (వీహెచ్) అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జే ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీల ఐక్యవేదిక సమావేశానికి వారు ముఖ్యఅతిథుగా హాజరై మాట్లాడారు. ప్రజల బాధలు తెలుసుకోవడానికే రాహుల్‌గాంధీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేశారన్నారు. తెలంగాణలో జనాభా దామాషా ప్రకారం బీసీలకు సీట్లు కేటాయించడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో 54 శాతం బీసీలుంటే వారిని సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకే పరిమితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి కృతజ్ఞతగా రాష్ట్రంలో ప్రజలంతా మద్దతుగా నిలిచి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలన్నారు. టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌గా మారినప్పుడే కేసీఆర్ పని అయిపోయిందని చెప్పారు. డబుల్‌బెడ్ రూం ఇళ్లకోసం అధికార పార్టీ నాయకులు రూ.2లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రానికి ఎవరైతే వ్యతిరేకంగా ఉంటారో.. మాట్లాడుతారో వాళ్లపై సీబీఐ ఎంక్వయిరీలు ఉంటున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని, బీసీలందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు చెరుకు సుధాకర్, లక్ష్మణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు బీర్ల అయిలయ్య, పున్న కైలాష్ నేత, రాపోలు జయప్రకాశ్, పీసీసీ సభ్యుడు కృష్ణయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనురాధ కిషన్‌రావు, నల్లగొండ జిల్లా సీనియర్ నాయకులు సిరాజ్ ఖాన్, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్, భువనగిరి నియోజకవర్గ సీనియర్ నాయకులు తంగెళ్లపల్లి రవికుమార్, సీనియర్ ఓబీసీ నాయకులు, జెడ్పీటీసీలు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు

నల్లగొండ టూటౌన్ : అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ రక్షణ కోసం, అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అంగన్‌వాడీ ఉద్యోగులను ఐసీడీఎస్ అధికారులు ఇబ్బందులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పాడిచెట్టి నాగమణి, ప్రధాన కార్యదర్శి బొందు పార్వతి, కె.విజయలక్ష్మి, ఎ.మణెమ్మ, పరిపూర్ణ, సుభాషిని, వి.లక్ష్మి, ఎం.ప్రమీల, సూర్యకళ, స్వరాజ్యం, ప్రక్కతాంబ, ప్రమీల, చంద్రమ్మ, లూర్ధమేరి, అరుణ, ఎండీ.సలీం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అద్దాలు అందలే..!

- కంటి వెలుగు అద్దాల కోసం 9,226 మంది ఎదురుచూపు
- ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాల సరఫరాలో జాప్యం



నల్లగొండ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. జూన్ 2వ తేదీన కంటి వెలుగు కార్యక్రమం ముగిసినా ఇంకా పూర్తిస్థాయిలో అద్దాలు అందించలేదు. దీంతో కంటి అద్దాల కోసం వేయి కళ్లతో ఎదురుచూడక తప్పడం లేదు.

1,09,292 మందికి రీడింగ్ అద్దాల అందజేత..

జనవరి 19న జిల్లాలో ప్రారంభమైన కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పకడ్బందీగా నిర్వహించింది. జిల్లాలో 74 బృందాలను ఏర్పాటు చేసి వారంలో ఐదు రోజుల పాటు అంటే శని, ఆదివారాలతో పాటుగా ప్రభుత్వ సెలవు దినాలు మినహా అన్ని రోజుల్లో ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 18 సంవత్సలు నిండి దృష్టిలోపంతో బాధపడుతున్న 8,04,740 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. అందులో 1,09,292 మందికి రీడింగ్ అద్దాలను అప్పటికప్పుడే అందజేశారు. ప్రధానంగా ఎక్కువ దృష్టిలోపం ఉన్నవారిని 83,459 మందిని గుర్తించి వారికి అవసరమైన కంటి అద్దాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆర్డర్ పెట్టింది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన 74,223 మందికి కంటి అద్దాలను అందజేశారు. ఇంకా 9,226 మందికి కంటి అద్దాలు ప్రభుత్వం నుంచి సరఫరా కాకపోవడంతో అందజేయని పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వం నుంచి రాగానే అందజేస్తాం



కంటి అద్దాల కోసం ఆర్డర్ పెట్టాం. ప్రభుత్వం దశల వారీగా అద్దాలను పంపిణీ చేస్తోంది. జిల్లాకు ఇంకా కంటి అద్దాలు రావాల్సి ఉంది. ప్రభుత్వం సరఫరా చేయగానే వారి ఇంటికి తమ సిబ్బంది పోయి అందజేస్తారు. కంటి అద్దాల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కంటి వెలుగు కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవడం ఆనందంగా ఉంది. మా సిబ్బంది కృషి అభినందనీయం.
– డాక్టర్ అన్నిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్ఓ

కంటి వెలుగుకు విశేష స్పందన..

జిల్లాలో వ్యాప్తంగా ఐదు నెలలు పాటు నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన 40 సంవత్సరాలు పైబడిన వారు ఎక్కువ సంఖ్యలో కంటి పరీక్షలను చేయించుకున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. నిరుపేదలు అధిక సంఖ్యలో కంటి పరీక్షలను చేయించుకుని ప్రభుత్వం అందించిన కంటి అద్దాలను వాడుతున్నారు.

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం

హుజూర్‌నగర్: పట్టణానికి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు సోమవారం ఫిర్యాదు అందడంతో హుజూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ లింగారెడ్డి తెలి పిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌లోని సుందరయ్య కాలనీకి చెందిన సుంకరి కనకమ్మ పెద్ద కుమారుడు ప్రసాద్ ఈ నెల 7వ తేదీన బట్టలు ఇస్త్రీ చేయించుకుని వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం అతడి తల్లి కనకమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

నల్లగొండ: 2023–24 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్, పదో తరగతి అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. ఆలస్య రుసుంతో ఆగస్టు 11 నుంచి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సంబంధిత స్టడీ సెంటర్ లేదా ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ జె.జగదీష్ కుమార్ ఫోన్ నంబర్ 80084 03523ను సంప్రదించాల్సిందిగా కోరారు.

ప్రభుత్వ స్థలంలో వెలిసిన గుడిసెలు

- గతంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఆ భూమి కేటాయింపు
- అనివార్య కారణాలతో పంపిణీ కాని పట్టాలు


ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసుకున్న గుడిసెలు

డిండి: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలివ్వాలని డిండి మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి గ్రామ సర్పంచ్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడంతో దాదాపు 23 సంవత్సరాలు నుంచి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఉన్నట్టుండి సోమవారం గుడిసెలు వెలిశాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల–కోదాడ హైవేకు ఆనుకొని ఉన్న ఎర్రగుంటపల్లి స్టేజీ వద్ద 1999 సంవత్సరం జూన్ 13వ తేదీన గ్రామానికి చెందిన 55 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వం సర్వే నంబర్లు 102, 105లో 2.30 ఎకరాల వ్యవసాయ భూమని అదే గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద కొనుగోలు చేసింది. ఆ తర్వాత అర్హులైన వారి జాబితాను అధికారులు తయారుచేసినప్పటికీ ఇళ్ల స్థలాల పట్టాలు మాత్రం పంపిణీ చేయలేదు. అప్పటి నుంచి దాదాపు 23 సంవత్సరాల పాటు ఖాళీగా ఉన్న అట్టి ప్రభుత్వ స్థలంలో గతేడాది నుంచి అంగన్‌వాడీ కేంద్రం, తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణంతో పాటు పలు ప్రభుత్వ భవనాలు నిర్మించాలని కొంతమంది అధికారులు ప్రయత్నాలు చేశారు. కానీ నిరుపేదలకు కేటాయించిన స్థలంలో ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే ఊరుకునేది లేదని పలువురు లబ్ధిదారులు పేర్కొనడంతో భవనాల ఏర్పాటుకు అనుమతుల ప్రక్రియ ఆగిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం అదే స్థలంలో 40 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఈ నెల 6వ తేదీన గ్రామ సర్పంచ్ పేట రాధ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో పాత జాబితాలోని 55 మందిని కాకుండా 40 మందికి మాత్రమే ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని జిల్లా ఉన్నతాధికారులకు నూతన జాబితాను పంపిచారన్న అనుమానంతో పాత జాబితాలోని పలువురు లబ్ధిదారులు ఖాళీ ప్రదేశంలోని పిచ్చి మొక్కలను తొలగించి గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. పాత జాబితానుసరించి 55 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు అందుతాయని పేర్కొన్నారు. ఆర్‌ఐ శ్యాంనాయక్ సమక్షంలో అట్టి స్థలంలో ఏర్పాటు చేసిన గుడిసెలను వీఆర్‌ఏ తొలగించినట్లు తహసీల్దార్ తెలిపారు.

గంజాయి తరలిస్తూ పట్టుబడిన యువకులు

- అరెస్ట్ చేసిన పోలీసులు


నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కొత్తగూడెం అర్బన్: గంజాయి రవాణాదారులను సోమవారం భద్రాద్రి కొత్తగూడెం పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు అరెస్ట్ చేశారు. కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ జయశ్రీ కథనం ప్రకారం.. గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఇల్లెందు క్రాస్ రోడ్డులో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడేనికి చెందిన రాంరాకేష్, జె.వసంత్, రంగారెడ్డి జిల్లా బాల్‌రెడ్డి నగర్‌కు చెందిన లావుడ్యా సాయి కారులో ఏపీలోని చింతూరు నుంచి 13.5 కేజీల గంజాయి తీసుకెళ్తున్నారు. గంజాయి కనిపించకుండా కారు డోర్‌లో ఫిక్స్ చేయగా... పోలీసులను గమనించి అతివేగంతో కొత్తగూడెం మీదుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో సుజాతనగర్ పోలీసులు రహదారిపై వాహనాన్ని అడ్డుగా పెడితే ఆ వాహనంతో పాటు మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా కారు నిలిచిపోయింది. ఈమేరకు పోలీసులు రూ.2.7లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కాగా, నిందితుల్లో ఒకరు బీటెక్, మరొకరు డిగ్రీ చదువుతుండగా, ఇంకొకరు షాపు నడుపుతున్నారు. వీరు వ్యసనాలకు అలవాటుపడి గంజాయి తీసుకెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న షహీనా

హుజూర్‌నగర్‌రూరల్: కుటుంబ కలహాలతో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం గ్రామానికి చెందిన షేక్ యూసుఫ్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి షేక్ షహీనాతో 16 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి 6వ, 9వ తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా చాలాకాలం ఇద్దరు వేర్వేరుగా ఉండగా.. ఇటీవలే మళ్లీ ఇరువురు కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇద్దరికీ గొడవ కావడంతో యూసుఫ్ పురుగుల మందు తాగాడు. అది గమనించిన షహీనా ఇంట్లోని విద్యుత్‌వైర్ పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయింది. కుటుంబ సభ్యులు గమనించి వారిద్దరిని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పాఠశాలలోని భారీ చెట్లు నరికివేత


ఏవీకేతండాలో చెట్ల దుంగలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న కూలీలు

ఆత్మకూర్ (ఎస్) : పాఠశాలల అభివృద్ధి, హరితహారం పేరుతో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుండగా.. క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. పచ్చదనం కోసం చెట్లను పెంచకపోగా ఏళ్ల నాటినుంచి నీడనిస్తున్న పెద్ద పెద్ద వృక్షాలను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలోని ఏవీకే తండా పాఠశాలలో ఏళ్ల క్రితం నాటిన వేపచెట్లతో పాటు ఇతర నీడనిచ్చే చెట్లు భారీగా పెరిగాయి. ఈ చెట్ల కారణంగా పాఠశాల ఆవరణ చల్లగా ఉండడంతో పాటు ఆహ్లాద వాతావరణం ఏర్పడుతుంది. ఉపాధ్యాయులు కొన్ని సమయాల్లో పిల్లలకు ఈ చెట్ల కిందనే పాఠాలు బోధించేవారు. అయితే అదనపు తరగతి గది, ప్రహరీ మంజూరు కాగా ఇదే అదునుగా స్థానిక సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు కలిసి ఈ చెట్లను ఓ వ్యాపారికి గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకున్నట్లు తండావాసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంఈఓ ధారాసింగ్‌ను వివరణ కోరగా పాఠశాలకు ప్రహరీ, అదనపు గది మంజూరైందన్నారు. వీటికోసం చెట్లను తొలగించినా ఎవరికి విక్రయించరాదని, కారకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పత్తి చేనులో గుంటుక తోలుతూ రైతు మృతి


భిక్షం (ఫైల్)

శాలిగౌరారం: పత్తి చేనులో గుంటుక తోలుతున్న ఓ రైతు గుండెపోటుతో చేనులోనే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెర్కకొండారం గ్రామానికి చెందిన సెగ్గెం భిక్షం(49)కు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. మరో ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకొని మొత్తం 10 ఎకరాలలో పత్తి సాగుచేశాడు. సోమవారం తన పొలంలోని పత్తి చేనులో 10మంది మహిళా కూలీలు కలుపు తీస్తుండగా.. మరోపక్క భిక్షం గుంటుక తోలుతున్నాడు. సాయంత్రం 4.30గంటల సమయంలో గుండెపోటుతో భిక్షం పొలంలోనే కుప్పకూలిపోయాడు. మహిళా కూలీలు గమనించి భిక్షంను సమీపంలోని చెట్టు కిందకు తరలించారు. అనంతరం 108 వాహనంలో నకిరేకల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, అవివాహితులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కుల బహిష్కరణ కేసులో 10మంది బైండోవర్

నడిగూడెం: మండల పరిధిలోని వల్లాపురం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తుడు దుస్సా వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ఇటీవల కుల బహిష్కరణ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం నడిగూడెం పోలీసులు ముదిరాజ్ కులానికి చెందిన 10మందిని తహసీల్దార్ టి. నాగేశ్వరరావు ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్‌ఐ పి. ఏడుకొండలు తెలిపారు.

సాగర్ జలాశయంలో సెయిలింగ్ రేస్


సాగర్ జలాశయంలో వాయిలర్‌లలో సెయిలింగ్ చేస్తున్న ఎన్‌సీసీ నేవీ క్యాడెట్స్

నాగార్జునసాగర్ : శిక్షణలో భాగంగా నావెల్ క్యాడెట్లకు సోమవారం నాగార్జునసాగర్ జలాశయంలో వాయిలర్ సెయిలింగ్ రేస్ నిర్వహించారు. జలాశయంలో నాలుగు వాయిలర్‌లతో రేస్ సాగింది. శిక్షణ పొందేవారు ముందు వెళ్తుండగా వారికి రక్షణగా ఎక్స్‌పెడిసన్ సేఫ్టీ ఆఫీసర్స్ వారి వెంట స్పీడ్‌బోట్లలో వెళ్లారు. వీరితో పాటు కమాండర్ భరత్‌భూషన్, లెఫ్టినెంట్ కమాండర్ హర్‌ప్రీత్‌సింగ్ తదితరులు ఉన్నారు.

చేపల పెంపకంపై యువత, రైతులు ఆసక్తి


సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్

పెన్‌పహాడ్: ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా నీటి వనరులు పుష్కలంగా లభించడంతో యువత, రైతులు చేపల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారని గరిడేపల్లి మండంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్ అన్నారు. సోమవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని జల్మాలకుంట గ్రామంలో కేవీకే ఆధ్వర్యంలో జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాల నుంచి రాష్ట్రంలో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని అన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద రూ.6వేల కోట్లు బడ్జెట్ కేటాయించబడిందని, మత్స్య పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చే వారికి సబ్సిడీ కల్పించి ప్రోత్సహిస్తుందని అన్నారు. దేశ ఆహార భద్రతకు దోహదపడే విధంగా ఆధునిక ఆక్వాకల్చర్ పద్ధతులను అవలబించడం, చేపల ఉత్పాదకతను కాపాడుకోవడంలో మత్స్య రైతులు ఎంతగానో కృషి చేస్తున్నారని న్నారు. కేవీకే ద్వారా యువతకు, రైతులకు జాతీయ మత్స్య అభివృద్ధి మండలి, హైదరాబాద్ సహకారంతో జిల్లా వ్యాప్తంగా 300పైగా రైతులకు మత్స్య పరిశ్రమపై స్వల్ప, దీర్ఘ కాలిక శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. చేపల చెరువులు నిర్మించదలచిన రైతులకు తగు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి తోడ్పాటు అందిస్తున్నామని అన్నారు. తద్వారా నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అవకాశాలు పొందుతున్నారని వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డి. నరేష్, కిరణ్, నరేష్, రైతులు డి. నాగేందర్, దేవుల, నవీన్, రమణ, లక్ష్మణ్, శంకర్, బోడు, జెత్‌రామ్లు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నారసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో సోమవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత మాంగళ్య ధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వమికి ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఏరోబిక్ సాగు ఎంతో మేలు

పాడి పంట


ఏరోబిక్ పద్ధతిలో నేరుగా పాడి దుక్కిలో వరి విత్తనాలు విత్తుతున్న రైతు


ఏపుగా పెరిగిన వరి పంట

నడిగూడెం: వర్షాభావ పరిస్థితులు, నీటి వనరులు తగ్గిపోతున్న నేపథ్యంలో వరి సాగు చేసే రైతులు ఏరోబిక్ పద్ధతిని అనుసరించాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు సూచిస్తున్నారు. ఏరో బిక్ పద్ధతిలో మొదట వరి విత్తనాలను పొడి దుక్కుల్లో విత్తుకొని ఆ తర్వాత కాల్వలు, బావులు, బోర్లలో భూ గర్భ జలాలు పెరిగిన తర్వాత పొలాలకు నీటి తడులు అందించి మాగాణి సాగుగా మార్చుకోవచ్చని పేర్కొన్నారు. ఏరోబిక్ సాగు వలన కలిగే లాభాలు ఆయన మాటల్లోనే..

- విత్తనాలను నేరుగా పొడి దుక్కుల్లో విత్తుకోచ్చు.
- పొలాన్ని దమ్ము చేయడం, నారుమడి పోసుకోవడం, నారుతీత, నాట్లు వేయడం ఏవీ అవసరం లేదు. దీని ఫలితంగా సాగు ఖర్చు, సమయం ఆదా అవుతుంది.
- నేలను దమ్ము చేసే పని ఉండదు.
- నేల భౌతిక స్థితి మెరుగ్గా ఉంటుంది.
- పదే పదే దమ్ము చేయడం వలన సాగు నేలల్లో బలం తగ్గిపోయి అపరాల దిగుబడి తగ్గిపోతుంది. అయితే ఏరోబిక్ పద్ధతిలో సాగుతో నేల బలం తగ్గిపోదు.
- భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగదు.
- తక్కువ మంది కూలీలతో విత్తుకోవచ్చు.
- తక్కువ ఖర్చుతో సీడ్ డ్రిల్ ద్వారా కూడా విత్తుకోవచ్చు.
- తొలకరి జల్లులు పడిన వెంటనే విత్తుకోవాలి.
- నారు పోయడం, నాట్లు వేసేందుకు కూడా ఖర్చు ఉండదు.
- 10 రోజుల ముందే పంట కోతకు వస్తుంది.
- 25 నుంచి 40 శాతం సాగు నీరు ఆదా అవుతుంది.

కలుపే ప్రధాన సమస్య

కలుపు ప్రధాన సమస్య కాబట్టి ఎక్కువగా రసాయనాలు వాడాల్సి ఉంటుంది. విత్తిన రెండు రోజు ల్లోపు ఎకరానికి పెండిమిథాలిన్ 1–1.5 లీటర్లు పిచికారీ చేయాలి. 15 నుంచి 20 రోజులకు పొలంలో గడ్డిజాతి కలుపు అధికంగా ఉంటే సహైలోపాప్ బ్యూటైల్ 400 మి.లీ. లేదా అన్ని రకాల కలుపు ఉంటే బిస్ పైరిబాక్ సోడియం 80 నుంచి 100 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలి.

సీడ్ డ్రిల్‌తో విత్తే విధానమే మేలు..

ట్రాక్టర్‌కు అమర్చిన సీడ్ డ్రిల్‌తో విత్తడం వల్ల కొంచెం లోతుగా విత్తనం భూమిలోకి చొచ్చుకెళ్లడంతో వేరు వ్యవస్థ విస్తరిస్తుంది. దీని వల్ల వర్షాలు, ఈదురుగాలులకు పైరు పడిపోకుండా బలంగా నిలబడుతుంది. ఈ పద్ధతిని అనుసరిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చు.

పంట దిగుబడి

సాధారణ వరి సాగు పద్ధతి కన్నా ఈ విధానంలో 5 నుంచి 10 బస్తాల దిగుబడి అదనంగా వస్తుంది. పంట కూడా నాణ్యంగా వస్తుంది.